# అయ్యా..మమ్మల్నీ బ్రతకనియ్యండి!

అయ్యా..మీరంతా చదువుకున్నోళ్ళు..నేను చెప్పేది కొద్దిగా ఓపిక చేసుకుని వినండి.
ఈ కులం..మతంలాంటి అడ్డుగోడలు తొలగించేస్తే..మనం మనం మానవులం. అంటే అన్నదమ్ములమన్న మాట.
మనకున్న ఇజ్ఞానంతోటి..ఇవేకం తోటి ఆలోచిస్తే మనమంతా కలసిమెలసి కమ్మగా బ్రతకాల..కాని జరుగుతున్నదేమిటి?
మనిషిని నడిపిస్తున్నది..కాదు కాదు ఆడిస్తున్నది డబ్బు. ఎప్పుడైనా..ఏ పరిస్తితుల్లోనైనా డబ్బులేనివాడు ఎందుకూ కొరగాడు. ఇది అందరికీ తెలిసిందే! ఇది కాదు నేను మీకు చెప్పదలచుకుంది.
మీరు డబ్బుతో ఏమైనా చెయ్యగలరనేది సత్యం.
ఈరోజు కాలుష్యం తన విషపు కోరలు అన్ని వైపులనుండీ ఎలా సాచిందో మీకుతెలుసు. పరిశ్రమలు ఉద్యోగాలిస్తున్నాయి..బ్రతుకునిస్తున్నాయి కాని గాలిలో..నీటిలో వ్యర్థ పదార్థాలని వదులుతూ కలుషితంచేస్తుంటే మనిషెట్టా మనుగడ సాగించగలడు? మీకేం..మీరు సుబ్రమైన నీరు తాగుతారు..పరిసుబ్రమైన గాలి పీలుస్తారు కానీ మేము మురికివాడల్లో జీవఛ్ఛవాళ్ళా పడివుంటున్నాం. మీ కార్లు..మోటర్లు విడిచే గాలి మాకు గాలి ఆడనియ్యడం లేదు. మీ ఆఫీసులకీ ఇళ్ళకీ బిగించిన ఏసీలు..వాతావరణాన్ని ఏడెక్కించి మాకు చలికాలం సైతం చెమట్లు పుట్టిస్తున్నాయి..ఎండాకాలం సరేసరి..నరకంలో సలసలా కాగుతున్న నూనేలో ఉంటున్నట్టు ఉంటుంది. రియల్ ఎస్టేట్ అంటూ చెట్లని నరుక్కుంటూ వెళ్ళి భూమిని ముక్కలు ముక్కలుగా చేసి కోట్లు గడించేశారు. మరి ఈనాడు ఆరు కాలాలు మారిపోయి.. సమయానికి వర్షాలు కురవట్లేదనీ..ఎండలు మండిపోతున్నాయనీ..వాపోవడమెందుకు? మీరు తెలిసి చేసిన తప్పుకి మమ్మల్నందరినీ బలిచేయడం భావ్యమా? సెల్ టవర్ల వల్ల నష్టమని తెలుసు..వాటిని అధికంగా వాడితే క్యాన్సర్ వచ్చే అవకాశం వుందనీ తెలుసు..అయినా తామర తంపరగా వినియోగంలోకి తీసుకు వస్తున్నారు..పిచ్చుకల్లాంటి పక్షులూ నామరూపాల్లేకుండా పోయాయి..మా ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. పేరు తెలియని రోగాల బారిన పడి మేము కృంగి కృశించి పోతున్నా మీకేం పట్టదు..అవునులే..'తనది కాకపోతే..'అన్న సామెత ఉండనే ఉందిగా. ప్రభుత్వాలు ఎందుకుంటాయో..ఎవరికేం మేలు చేస్తున్నాయో దేవుడికెరుక. మేము తాగితే ప్రభుత్వ బొక్కసాలు కళ కళ్ళాడతాయిట..అందుకని మేము కడుపునిండా తాగాలి..తాగి తందనాలాడాలి..ఆ మైకంలో తప్పచేస్తే సిక్షించాలి..అవును మరి పోలీసోల్లకీ కోర్టోల్లకీ కూడా పనుండాలకదా..మేమేమయిపోతే ఆల్లకేం? గెలవడానికీ.. ప్రబుత్వాలు పెట్టడానికీ మేముకావాలి..అవి సవ్యంగా నడవడానికీ మేము కావాల..కాని మాకు మాత్రం మంచి బ్రతుకివ్వరు.
అయ్యా! మీరు సల్లగా బ్రతుకుతున్నారని మాకు బాదలేదు. మీరు సుఖపడుతున్నారని మేము

ఏడ్వడంలేదు..పీల్చే గాలి..తాగే నీరు కల్తీ అయిపోతున్నాయి..గొట్టపు బావులేసి మోటర్లు పెట్టి నీరు తోడేస్తుంటే..నేల తల్లి గుండె ఎండి పోతోంది..గొట్టపు బావుల్లోంచి చుక్క నీరు రావడం లేదు..బూ గర్బ జలాలు ఎండిపోతున్నాయంట..వర్షాల్లేక..బూమిలో నుండి నీరు రాక బక్కరైతు పంట ఎలా పండిస్తాడు?

ఇల్లల్లోనూ..ఆఫీసుల్లోనూ ఎంత కాలం వుంటారు? అప్పుడప్పుడైన బైటకొస్తారు కదా..వాతావరణం కలుషితమైతే మీకూ ప్రమాదమే కదా..పేరు తెలియని..నోరు తిరగని రోగాలొస్తే మీకూ బ్రతుకు నరకమే కదా.ఇయ్యన్నీ వూహించరా?

ఇప్పటికే మన తల్లిలాంటి ప్రకృతిని చేతులారా నాశనం చేసుకున్నాం. తల్లి కాబట్టి ఇంకా క్షమిస్తోంది.

మనదే చివరి తరం కాదు మన పిల్లా పాపలు కూడా సుకంగా వుండాల..ఆళ్ళకి కమ్మటి గాలి..చల్లటి..తియ్యటి నీళ్ళు ఇయ్యగలగాలి. సిన్న సిన్న రోగాలు రావాల గాని డబ్బూ..పానాలు తోడేసే రోగాలుండకూడదు. గాలీ నీరూ కొనుక్కునే దౌర్బాగ్యం మనకొద్దు..ఇంగితం వున్న మనుసులుగా పుట్టాం..అట్టాగే జీవించాల. ఈడి ముఖం ఈడు చెప్పేదేమిటని పెడసెవిన పెట్టమాకండి..పేదోన్నయినా..పెద్దోన్ని..సెబుతున్నా..హాయిగా సల్లగా బతకడం కన్నా ఇంకేం కావాల? పరాయి దేశాల మోజులో పడి మీ అస్థిత్వాన్ని తాకట్టు పెట్టమాకండి. ఉరుకులూ పరుగుల జీవితంలో మీరు సాదించేదేమిటి? ఆప్యాయత..అనుబంధాలకి అర్ధం తెలుసా? 'ఒకరి కోసం ఒకరు' అనుకోవడంలో వుండే తృప్తి అనుబవించండి...పిల్లలు పద్దాకా ఆ కంపూటరు ముందు కూనోకుండా చూడండి. లేకపోతే ఆల్ల ఆలోచనా శక్తి మందగించిపోతుంది. ఆళ్ళూ మరమనుషులైపోతారు. ఆళ్ళ చేత సందమామ కతలు సదివించండి..మీ అమ్మనాయినా కాడ వదలండి..ఆళ్ళే పెరుగుతారు..సక్కంగా ఎదుగుతారు..ఓ పైసలెక్కువిచ్చి పెద్ద పెద్ద బడులల్ల ఏస్తున్నారుగాని..ఆల్లని బందిస్తున్నారని అర్ధమైతల్లేదా? మెదడెదగాల అంతేగాని మొండిదవగూడదు.

మితిమీరిన సొతంత్రం చెరుపు చేస్తుంది. ఆడ మగ ఎవరైనా క్రమసిక్షనల వుండాల..అప్పుడే కుటుంబ గౌరవం.

అమ్మా నాయిన ముసలోల్లు అయితే వట్టిపోయిన ఆవుల్ని కబేలాకి తోసినట్టు..అనాద శరణాలయ్యాల్లో చేర్చమాకండి. మనం మనుషులం..రాక్షసుల్లా వుండకూడదు. ఆల్లే లేకపోతే మనం లేం! ఆల్ల మనసు కష్ట పెడితే ఇంక మన మేడ పైకొస్తాం? మనకున్న దాంట్లో ఆళ్ళకింత పెట్టిసూడండి..తిరుపతికెల్లి ఎంకన్న బాబుని సూసినంత పున్నెం.నా మాట నమ్మండి.

సెప్పేటోడు లేక సెడిపోయాడంటారు..నేను నా కున్న లోక జ్ఞానంతో (మిడి మిడి జ్ఞానం మాత్రం కాదు) సెబుతున్నా.ప్రకృతిని ప్రేమించండి..అమ్మ నాయినల్ని ప్రేమించండి..పిల్లల్ని ప్రేమతో పెద్దచేయండి..పైస వెనకాల పరిగెట్టకండి..వాతావరణాన్ని పాడుచేయకండి..మనం కలిసి మెలిసి మన బూమిని..గాలిని..నీటినీ కాపాడుకుందాం..తప్పు ఎవరు చేసినా సిక్ష అందరికీ పడుతుంది..అందుకని తప్పు చేసేవాడిని మందలించండి..పంచభూతాలు అందరివీ..వాటిని పదిలంగా చూసుకోవాల..ఏదో నాలుగురోజులకోసం ఈ భూమ్మీదకొచ్చాం మంచిగా జీవించి మరణించాల.అంతేగాని దీన్ని పాడుచేసే హక్కు మనకు లేదు. ఈ

భూమ్మీదకి వచ్చేవాళ్ళకోసం మంచి ప్రకృతితో నవ్వుత ఎదురుచూస్తుండాల..పోయినోల్లని నవ్వుతా సాగనంపాల. అంతేగాని మన స్వార్థం కోసం అంతా నాశనం చేయకూడదు. మీరు బ్రతకండి మమ్మల్నీ బ్రతకనీయండి. మీకు దండంపెదతా..

**********

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

"ఈ కథ నా సొంతం..అనుసరణ కాని..అనుకరణ కాని కాదు..ప్రసారం కాలేదు"

చిరునామా:

ప్లాట్ నం:B-40

రోడ్ నం:4

జె జె నగర్

సైనిక్ పురిపోస్ట్

సికింద్రాబాద్

500 094

సెల్: 9393981918